మౌర్యానంతర యుగం - మహాయానం... కళల వికాసం

మౌర్యానంతర యుగం (క్రీ.పూ 200-క్రీ.శ 300) శకులు, కుషాణులు, శాతవాహనులు, తొలి తమిళ రాజ్యాలు వర్ధిల్లిన కాలం. ప్రాచీన భారత ఆర్థిక చరిత్రలో ఈ కాలానికి ఎంతో ప్రాధాన్యముంది. హస్తకళలు అద్భుతంగా పురోగమించాయి. వస్తూత్పత్తి ఇనుమడించింది. తూర్పు రోమన్ సామ్రాజ్యంతో భారతదేశం సాగించిన వాణిజ్యం ఉత్పత్తిని ప్రేరేపించింది. క్రీ.శ 1వ శతాబ్దిలో రుతుపవనాల ఉనికిని గుర్తించడంతో సముద్రాంతర వాణిజ్యం పెరిగింది. పశ్చిమ తీరంలో బ్రోచ్, సొపారా, తూర్పుతీరంలో అరికమేడు, తామ్రలిప్తి వంటి రేవు పట్టణాలు ప్రాచుర్యంలోకి వచ్చాయి. ఈ ఆర్థిక పరిణామాలు మత రంగాన్ని, కళలను ప్రభావితం చేయడం విశేషం. మహాయానం ఆవిర్భవించడం; గాంధార, మధుర, అమరావతి శిల్ప శైలుల వికాసం మౌర్యానంతర యుగానికి సంబంధించి కీలకమైన చారిత్రక విశేషాలుగా చెప్పుకోవచ్చు.

మహాయానం - ఆవిర్భావం:

మౌర్యానంతర యుగంలో సంభవించిన సామాజిక, సాంస్కృతిక, ఆర్థిక పరిణామాలు మహాయాన ఆవిర్భావానికి దారితీశాయి. మౌర్యానంతర యుగంలో ఎందరో విదేశీయులు భారతదేశంలోకి ప్రవేశించి స్థిరపడ్డారు. ఇండో-గ్రీకులు, శకులు, పార్థియన్లు, కుషాణులు వంటి వారు భారతీయ సమాజంలోకి ప్రవేశించారు. విదేశీయులను సనాతన బ్రాహ్మణ మతం మొదట 'మ్లేచ్ఛులు'గా పరిగణించి ఏవగించుకోగా, బౌద్ధం వారికి ద్వారాలు తెరిచింది. భారతీయ సమాజంలో విలీనమయ్యేందుకు ఆ విదేశీ తెగలకు బౌద్ధం ఒక వాహిక అయింది. అగథోక్లిస్ అనే ఇండో-గ్రీకు రాకుమారుడు తన నాణేలపై బౌద్ధ చిహ్నాలను ముద్రించాడు. మీనాండర్ అనే పాలకుడు బౌద్ధం పట్ల విపరీత ఆసక్తిని ప్రదర్శించాడు. మీనాండర్‌కు, నాగసేనుడనే బౌద్ధ సన్యాసికి మధ్య నడిచిన సంభాషణలే మిళింద పన్హా అనే గ్రంథంలో నిక్షిప్తమయ్యాయి.

జున్నార్, నాసిక్, కార్లే వంటి చోట్ల గ్రీకులెందరో బౌద్ధానికి విశేష పోషణ కల్పించారు. బౌద్ధమత ప్రాచుర్యంలో కనిష్కుడు కీలకపాత్ర పోషించాడు. మాంసాహారులైన ఈ విదేశీయులు బౌద్ధంలో చేరడంతో.. బౌద్ధంలోని అహింస వంటి మౌలిక భావనలు ప్రశ్నార్థకమై వివాదాలు చెలరేగి ఉంటాయి. ఈ వివాదాల నేపథ్యంలో బౌద్ధ సంఘంలో వచ్చిన చీలిక మహాయానానికి దారితీసి ఉండొచ్చు. మౌర్యానంతర యుగంలో బౌద్ధం విదేశాలకు ముఖ్యంగా పశ్చిమ, మధ్య ఆసియా ప్రాంతాలకు విస్తరించింది. కుషాణులు ఇందుకు దోహదపడ్డారు. ఫలితంగా కొందరు బౌద్ధ గురువులు, సన్యాసులు విదేశాలకు వెళ్లారు. అలాగే వాణిజ్య అవసరాలపై, బౌద్ధం స్వీకరించిన కొందరు వర్తకులు కూడా విదేశాలకు వెళ్లి ఉంటారు. పశ్చిమాసియా, మధ్యాసియాలతో బౌద్ధానికి ఏర్పడ్డ పరిచయం కొన్ని కొత్త



భావనలను బౌద్ధంలోకి ప్రవేశపెట్టిందని భావించవచ్చు. క్రైస్తవంలోనూ, జొరాస్ట్రియన్ మతంలోనూ ప్రచారంలో ఉన్న రక్షకుడు అనే భావన మైత్రేయ బుద్ధుడు అనే భావనగా మహాయానంలోకి ప్రవేశించిందని చెప్పొచ్చు.

మహాయాన ఆవిర్భావ, పరిణామాల్లో విదేశీ ప్రభావాన్ని కూడా కొంత గుర్తించక తప్పదు. మౌర్యానంతర యుగంలో వర్తక, వాణిజ్యాలు, హస్తకళలు వికసించడంతో వైశ్య, శూద్ర వర్ణాలవారు ఆర్థికంగా బలపడ్డారు. వారు సహజంగానే బౌద్ధానికి విరివిగా దానాలు చేశారు. ఫలితంగా బౌద్ధ సంఘంలో సంపద పేరుకుపోయింది. ఈ పరిస్థితుల్లో సంఘంలోని సన్యాసుల్లో క్రమశిక్షణ తగ్గి సుఖ జీవనం అలవాటయింది. ఈ నేపథ్యంలో సంఘంలో తలెత్తిన వివాదాలు చీలికకు దారితీశాయి. సమకాలీన సాంఘిక, ఆర్థిక పరిణామాలను ఆసరాగా చేసుకుని, బౌద్ధాన్ని విస్తృతంగా వ్యాపింప చేయాలనుకున్న కొందరు సన్యాసులు మహాయాన రూపకల్పనకు దోహదపడ్డారు. మౌర్యానంతర యుగానికి ఉపఖండం అంతా రవాణా మార్గాలు ఏర్పడ్డాయి. ఫలితంగా బౌద్ధ సన్యాసులు మతవ్యాప్తి కోసం దేశమంతా సంచరించసాగారు. కొత్త ప్రాంతాల్లో, కొత్త సమూహాలను ఆకర్షించేందుకు బౌద్ధం ఎన్నో స్థానిక సంప్రదాయాలను, ఆచారాలను స్వీకరించసాగింది. ఈ క్రమంలో బౌద్ధమతానికి సంబంధించిన మౌలిక భావనలపై ఎన్నో కొత్త వ్యాఖ్యానాలు మొదలయ్యాయి. ఈ వ్యాఖ్యానాలు చివరకు బౌద్ధ సంఘంలో చీలికకు కారణమై మహాయాన ఆవిర్భావానికి దారితీశాయి.

మహాయాన భావనలు:

బోధిసత్వ భావన మహాయాన బౌద్ధంలో కీలక పాత్ర పోషించింది. బుద్ధుని నిర్వాణం తర్వాత అతని విశిష్ట వ్యక్తిత్వాన్ని మరువలేని శిష్యులు, అనుచరులు అతని జీవితగాథను అసాధారణ రీతిలో మలచసాగారు. ఈ క్రమంలోనే బుద్ధుడు ఎన్నో జన్మల తర్వాత సిద్ధార్థుడిగా జన్మించి నిర్వాణం పొందాడనే భావన అంకురించింది. చారిత్రక బుద్ధుడికి పూర్వం ఎందరో బుద్ధులు ఉన్నారనే భావన ఎన్నో కథలుగా రూపుదిద్దుకుంది. అశోకుని కాలానికే ఈ పూర్వబుద్ధులను పూజించడం, అశోకుడు ఈ విశ్వాసాన్ని ప్రోత్సహించడం జరిగాయి. 'స్థవిర

వాద బౌద్ధం' ఇలాంటి 35 మంది బౌద్ధులను గుర్తించింది. బోధిసత్వునిగా ఎన్నో జన్మలెత్తిన తర్వాతే బుద్ధుడు శాక్యమునిగా జన్మించి నిర్వాణం పొందాడనే విశ్వాసం ప్రచారంలోకి వచ్చింది. మహాయాన బౌద్ధం బోధిసత్వ భావనను ఇంకా విస్తృతపరిచింది. బోధిసత్వుడు సృష్టిలోని ప్రతి ప్రాణీ నిర్వాణం పొందేంతవరకు తన నిర్వాణాన్ని వాయిదా వేసుకుంటూ, పదేపదే జన్మిస్తాడని ప్రచారం చేశారు. బోధిసత్వుడు మానవుల కోసం వేదనలను కూడా భరించే రక్షకుడని తీర్మానించారు. బహుశా రక్షకుడు అనే భావన మధ్య ప్రాచ్యంలో అప్పటికే ప్రచారంలో ఉన్న క్రైస్తవ విశ్వాసాల ప్రభావం అయ్యి ఉండొచ్చని కొందరు పండితుల అభిప్రాయం. మహాయానం ప్రకారం విశ్వంలో ఎందరో బోధిసత్వులు ఉన్నారు. భూమికి సంబంధించి అవలోకితేశ్వరి, పద్మపాణి, మంజుశ్రీ, వజ్రపాణి వంటి బోధిసత్వులకు ప్రాధాన్యముంది.

మహాయానం ప్రపంచమంతా దుఃఖమయం అనే మౌలికమైన బౌద్ధ భావనను అంగీకరించినప్పటికీ ఎంతో ఆశావాదాన్ని ప్రదర్శించింది. ప్రతి ప్రాణిలోనూ బోధిసత్వ అంశ ఉందనీ, అంతిమంగా ప్రతి ప్రాణీ నిర్వాణం పొంది తీరుతుందని ప్రచారం చేశారు. మహాయానంలో త్రికాయ భావన మరో ముఖ్యాంశం. బుద్ధుడు ఒక వ్యక్తికాదని, అనంతమైన ఆధ్యాత్మిక శక్తికి అభివ్యక్తి అని ఆ శక్తి ధర్మకాయ, సంభోగకాయ, నిర్మాణ కాయ అనే మూడు విధాలుగా ఉంటుందని వీరు భావించారు. (ఇది క్రైస్తవంలోని హోలీ ట్రినిటీ భావనకు దగ్గరగా ఉంది. ఎవరు ఎవర్ని ప్రభావితం చేశారనేది ప్రశ్నార్థకం) పుణ్యాన్ని బదిలీ చేయవచ్చు (ట్రాన్స్‌ఫర్ ఆఫ్ రిలిజియస్ మెరిట్) అనే భావనను మహాయానం ప్రచారంలోకి తెచ్చింది. ఒక వ్యక్తి పేరున ఎవరు దానధర్మాలు చేసినా, పుణ్యం ఆ వ్యక్తికి బదిలీ అవుతుందని వీరు ప్రచారం చేశారు. మహాయానంలో ఎన్నో శాఖలున్నప్పటికీ మాధ్యమిక, యోగాచార వాదాలు ప్రధానంగా వ్యాప్తిలోకి వచ్చాయి. మాధ్యమిక వాదంలో నాగార్జునుడు మనం శూన్యంతో నిండి ఉన్నామని, సంసారం (జనన,మరణ చక్రం), నిర్వాణం (విముక్తి/మోక్షం) రెండూ శూన్యమేనని వాదించాడు. యోగాచార శాఖకే విజ్ఞానవాది శాఖ అనే పేరు కూడా ఉంది. ప్రపంచం చైతన్యంతో నిర్మితమవుతుందని వీరి భావన. మనం భావించే వాస్తవం, కల వంటిదేనని వీరి అభిప్రాయం.

మహాయాన ప్రభావం:

మహాయానం బుద్ధుడిని లోకోత్తరునిగా, దైవస్వరూపునిగా మార్చివేసి, విగ్రహారాధనను ప్రోత్సహించింది. ఈ ప్రభావంతో పౌరాణిక హైందవంలో విగ్రహారాధన ప్రవేశించి వెర్రితలలు వేసింది. మహాయానం ప్రచారం చేసిన బోధిసత్వ భావన హిందూమతంలో అవతార సిద్ధాంతానికి దారితీసింది. మహాయానం అందరికీ నిర్వాణం అంటూ అన్ని వర్గాల ప్రజలకు ఆధ్యాత్మిక ఓదార్పునిచ్చింది. వైశ్యులు, శూద్రులు, ఇతర బలహీనవర్గాలవారు మహాయానాన్ని స్వీకరించి, పోషించి తమ హోదాను పెంచుకునే ప్రయత్నం చేశారు. మహాయానం వాస్తు, శిల్ప, చిత్రలేఖనాలను ప్రోత్సహించింది. దేశవ్యాప్తంగా వెలుగుచూసిన ఎన్నో స్థూపాలు, విహారాలు, చైత్యాలు మహాయానానికి సంబంధించినవే. గాంధార, మధుర, అమరావతి శిల్పరీతులు మహాయానం కృషికి నిదర్శనాలు. అజంతా గుహల్లోని చిత్రాలు.. మహాయాన బౌద్ధానికి ఉదాహరణలు.

మహాయానం విస్తృతమైన సాహిత్యాన్ని సృష్టించి, సంస్కృత భాషా వికాసానికి దోహదపడింది. వైపుల్య సూత్రాలు, లలిత విస్తార సద్ధర్మ పుండరీక, వజ్రచ్ఛేదిక, సుఖావతి వ్యూహ, కరండ వ్యూహ, అష్ట సహస్రిక ప్రజ్ఞాపారమితా వంటి రచనలు వెలువడ్డాయి. మహాయానం సైద్ధాంతిక దృఢత్వాన్ని ప్రదర్శించక, పరిసరాలకు, పరిస్థితులకు అనుగుణంగా తనను తాను మలుచుకున్నది. ఎన్నో స్థానిక సంప్రదాయాలను, విశ్వాసాలను తనలో కలుపుకుంటూ సాంస్కృతిక సమైక్యతకు దోహదపడింది. మహాయానం ప్రదర్శించిన ప్రచారోత్సాహం కారణంగా బౌద్ధం ఉపఖండమంతా వ్యాపించడమే కాకుండా ఆసియా మతంగా ఎదిగింది. ఈ క్రమంలో భారతదేశానికి పొరుగుదేశాలతో విలువైన సాంస్కృతిక సంబంధాలను ఏర్పరచింది. మహాయానం ప్రభావం వల్లే మూఢ విశ్వాసాలు, కర్మకాండలు ఎక్కువయ్యాయని చెప్పొచ్చు. మహాయానం ఇంకా వక్రదశకు చేరుకుని వజ్రయానంగా పరిణమించి బౌద్ధం స్వచ్ఛతను, నిరాడంబరతను పూర్తిగా మంటగలిపింది. మహాయానం పొందిన మార్పులు బౌద్ధానికి, హిందూ మతానికి తేడా లేకుండా చేసి, బౌద్ధానికున్న ప్రత్యేకతను దెబ్బతీశాయి. భారతదేశంలో క్రమంగా బౌద్ధం క్షీణించడానికి మహాయానం కూడా ఒక కారణమని చెప్పొచ్చు.

గాంధార, మధుర, అమరావతి శైలులు:

మౌర్యానంతర యుగంలోనే గాంధార, మధుర, అమరావతి శిల్ప శైలులు వర్ధిల్లడం విశేషం.

గాంధార శైలి: అఫ్గానిస్థాన్‌లోని జలాలాబాద్, హద్దా, బమియాన్, బెగ్రాం, పాకిస్థాన్‌లోని పెషావర్ గాంధార శిల్ప కళకు ప్రధాన కేంద్రాలు. ఈ ప్రాంతం చారిత్రకంగా అఖామెనిడ్లు, గ్రీకులు, మౌర్యులు, శకులు, కుషాణుల పాలనలో ఉండటం వల్ల మిశ్రమ సంస్కృతీ కేంద్రంగా వర్ధిల్లింది. ఇక్కడ వికసించిన గాంధార శిల్పశైలిని ఇండో-గ్రీకు శైలిగానూ, గ్రీకో-బౌద్ధ శైలిగానూ పిలిచారు. కొందరు.. గాంధార శిల్పులకు భారతీయ హృదయం, గ్రీకు హస్తం ఉన్నాయని వ్యాఖ్యానించారు. ఇక్కడ ప్రధానంగా బౌద్ధ మతానికి చెందిన శిల్పాలను చెక్కారు. ఇక్కడ మానవదేహాన్ని అంగ సౌష్ఠవంతోనూ, ముఖ కవళికలతో వాస్తవికంగా చెక్కే ప్రయత్నం చేశారు. బుద్ధుడికి ఉంగరాల జుట్టును, సిగముడిని అమర్చారు. పారదర్శకంగా ఉన్న పల్చటి వస్త్రాన్ని కప్పారు. బుద్ధుడి శిల్పంలో 'అపోలో' పోలికలను చొప్పించారు. బుద్ధుడి తల్లిని కూడా ఒక ఏథెన్స్ మాతవలె చెక్కారు.

మధుర శైలి: మధుర పరిసర ప్రాంతాల్లో ఈ శైలి వర్ధిల్లింది. బ్రాహ్మణ, జైన, బౌద్ధ మతాలకు చెందిన శిల్పాలను చెక్కారు. రాజకీయ ప్రము

ఖుల శిల్పాలు కూడా చెక్కడం మరో విశేషం. నగ్నంగా కూర్చొని ఉన్న జైన తీర్థంకరుల శిల్పాలు ఈ శైలి తొలి దశ అని పరిశోధకుల భావన. తీర్థంకరులను వారి చిహ్నాలతో ప్రదర్శించడం విశేషం. ఉదా: భుజాల వరకు వేలాడే జుట్టుతో రుషభనాథుడిని, పాము పడగలతో పార్శ్వనాథుడిని చెక్కారు. బౌద్ధ శిల్పంలో కూడా కొన్ని ప్రత్యేకతలున్నాయి. ఇక్కడ బుద్ధుడు బోధివృక్షం కింద కుడిచేతితో అభయముద్రను చూపిస్తూ, బిగుతుగా కప్పుకున్న వస్త్రాన్ని ఎడమచేతితో పట్టుకుని ఆసీనుడై ఉన్నాడు. బుద్ధుడి తలపై ఒక సిగపాయను మాత్రమే ఉంచి మిగిలిన భాగమంతా గుండును ప్రదర్శించారు. ఇంకా సరస్వతి, సూర్యుడు, లక్ష్మి, కార్తికేయుడు, శివుడు, కుబేరుడు, యక్షుడు, యక్షిణుల శిల్పాలను చెక్కారు. హిందూ దేవతలకు సంబంధించిన ప్రత్యేక లక్షణాలను చూపించారు. **ఉదా:** సరస్వతి దేవి చేతిలో రాత ప్రతితో కన్పించగా, రథారూఢుడైన సూర్యుడు, బానపొట్టతో కుబేరుడిని చెక్కారు.

అమరావతి శైలి: కృష్ణానదీ లోయలో అమరావతి, నాగార్జున కొండ, జగ్గయ్యపేట, గోలి వంటి చోట్ల ఈ శిల్పశైలి వర్ధిల్లింది. జాతక గాథల్లోని ఘట్టాలను శిల్పాల్లో ఆవిష్కరించారు. ప్రకృతిలోని అన్ని వస్తువులను శిల్పంలో ప్రదర్శించినప్పటికీ, మానవ శిల్పాలకే ప్రాధాన్యమిచ్చారు. మానవ దేహాన్ని పొడైవన కాళ్లతో, సన్నటి నాజూకైన నిర్మాణంతో శిల్పీకరించారు. జీవత్వం ఉట్టిపడే చైతన్యవంతమైన కదలికలు అమరావతి శైలి ప్రత్యేక లక్షణం. కోపం, జాలి, ప్రేమ, భయం వంటి మానవ భావోద్వేగాలను శిల్పీకరించడం అమరావతి శిల్పుల ప్రతిభకు తార్కాణం.

ముఖ్యాంశాలు

- అగథోక్లిస్ అనే ఇండో-గ్రీకు రాకుమారుడు తన నాణేలపై బౌద్ధ చిహ్నాలను ముద్రించాడు.
- బౌద్ధమత ప్రాచుర్యంలో కనిష్కుడు కీలకపాత్ర పోషించాడు.
- 'స్థవిరవాద బౌద్ధం' ఇలాంటి 35 మంది బౌద్ధులను గుర్తించింది.
- గాంధార శిల్పశైలిని ఇండో-గ్రీకు శైలిగానూ, గ్రీకో-బౌద్ధ శైలిగానూ పిలిచారు.
- బుద్ధుడి శిల్పంలో 'అపోలో' పోలికలను చొప్పించారు.